నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
10 | శనివారం 14 డిసెంబర్ 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD



చెన్నూర్ పోలీస్ స్టేషన్ ఆవరణలో పోలీసుల అదుపులో ఉన్న ఆర్పీలు

# సమస్యలు చెప్పుకోకుండా అడ్డుకుంటారా?

- పోలీసులను ప్రశ్నించిన మెప్మా ఆర్పీలు
- చెన్నూర్‌లో ముందస్తుగా అదుపులోకి తీసుకోవడంపై అసహనం

చెన్నూర్, డిసెంబర్ 13 : 'సమస్యలను సర్కారు దృష్టికి తీసుకెళ్లేందుకు వెళ్తుంటే అడ్డుకుంటారా.. ఇదెక్కడి న్యాయం' అంటూ చెన్నూర్ మున్సిపాలిటీలో పని చేస్తున్న మెప్మా ఆర్పీలు పోలీసులను ప్రశ్నించారు. డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించతలపెట్టిన ధర్నాకు వెళ్లకుండా పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకొని పోలీసుస్టేషన్‌కు తరలించడంపై అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆర్పీలు మాట్లాడుతూ చెన్నూర్ మున్సిపాలిటీలో వార్డుకొకరు చొప్పున 18 మందిమి పని చేస్తున్నామని, ఏడు నెలలుగా వేతనాలు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. చాలీ చాలని వేతనాల(రూ. 6 వేలు)తో పనిచేస్తున్నామని, ప్రభుత్వ పథకాలను ప్రజల వద్దకు తీసుకెళ్లేది తామేనన్నారు. గత ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ తమ సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ధర్నా, నిరసన చేపట్టి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించామని, అక్కడికి వెళ్లకుండా పోలీసులు అడ్డుకోవడం అన్యాయమన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్పీల సంఘం నాయకులు కల్పన, ఉమ, కుందారం లక్ష్మి పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో ఆర్పీల ఆందోళన



హైదరాబాద్‌లోని మెప్మా ఎండీ కార్యాలయంలో మంచిర్యాల జిల్లా ఆర్పీలు


మంచిర్యాలటౌన్, డిసెంబర్ 13 : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ హైదరాబాద్‌లోని మెప్మా ఎండీ కార్యాలయం ఎదుట మంచిర్యాల పట్టణానికి చెందిన 160 మంది రిసోర్స్ పర్సన్లు శనివారం ఆందోళన నిర్వహించారు. మెప్మా ఆర్పీల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షురాలు అరుణ, కార్యదర్శి రుక్మిణి, కోశాధికారి మంగ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఆరు వేల మంది ఆర్పీలు పనిచేస్తున్నారని, కేవలం రూ. 6 వేల వేతనం తీసుకుంటూ ఏళ్లకేళ్లుగా పనిచేస్తున్నామని, ఏడు నెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్పీలపై అధికారుల ఒత్తిడి, వేధింపులు, వెట్టిచాకిరీ అరికట్టాలని, ప్రభుత్వమే నేరుగా వేతనాలు ఇవ్వాలని, పీఆర్సీ అమలు చేయాలని, కనీస వేతనం ఇవ్వాలని, రాష్ట్రవ్యాప్తంగా ఒకేరకమైన డ్రెస్‌కోడ్ అమలు చేయాలని, జాబ్‌చార్ట్‌ను విడుదల చేయాలని, ఆర్పీలు మరణిస్తే వారి కుటుంబానికి రూ.10 లక్షల బీమా వర్తించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## రోడ్డుపైనే.. 108



భీమారంలో రోడ్డుపై నిలిపి ఉన్న 108 అంబులెన్స్

భీమారం, డిసెంబర్ 13 : ప్రభుత్వం ఇటీవల భీమారం మండలానికి 108 అంబులెన్స్‌ను మంజూరు చేయగా, దానిని నిలిపేందుకు స్థలం లేక సిబ్బంది తిప్పలు పడుతున్నది. పొద్దంతా మంచిర్యాల – చెన్నూర్ జాతీయ రహదారి పక్కనే నిలిపి ఉంచుతుండగా, రాత్రి మాత్రం స్థానిక రావిచెట్టు కాలనీలోని ఓ వినాయకుడి షెడ్‌లో పార్క్ చేస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి అంబులెన్స్ కోసం ప్రత్యేకంగా స్థలం కేటాయించడంతో పాటు షెడ్ ఏర్పాటు చేయాలని ఉద్యోగులు కోరుతున్నారు.



కవ్వాల్ అడవుల్లో ఏర్పాటు చేసిన బొమ్మ పులి





కుమ్రం భీం అడవుల్లో సంచరిస్తున్న పులి

# పులులు ఇక్కడ.. నిధులేమో అక్కడ..!

## కాగజ్‌నగర్ టైగర్ కారిడార్‌ను లెక్క చేయని సర్కారు

- నిధుల కొరతతో పులుల సంరక్షణకు అధికారుల పాట్లు
- ఒక్క పులి లేని కవ్వాల్‌కు మాత్రం కోట్లాది రూపాయల కుమ్మరింపు
- అటవీశాఖలో చర్చనీయాంశం

కుమ్రం భీం ఆసిఫాబాద్, డిసెంబర్ 13 (నమస్తే తెలంగాణ) : ఒక్క పులి లేని కవ్వాల్ రిజర్వ్ ఫారెస్ట్ ఏరియాలో కోట్లాది రూపాయలు కుమ్మరిస్తున్న సర్కారు, పులులకు నిలయమైన కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ టైగర్ కారిడార్‌ను మాత్రం లెక్క చేయకపోవడం చర్చనీయాంశమవుతున్నది. ఈ ప్రాంతానికి నిధుల కేటాయించకపోవడంతో పులుల సంరక్షణ చర్యలు చేపట్టేందుకు అధికారులకు కష్టంగా మారుతున్నది.

### పులులకు అడ్డాగా కాగజ్‌నగర్ అడవులు

ఒకప్పుడు ఒకటీ.. రెండు పులులు కనిపించే కాగజ్‌నగర్ డివిజన్ ఫారెస్ట్ ఇప్పుడు వాటికి అడ్డాగా మారింది. ఫాల్గుణ అనే పులి నాలుగు పిల్లలకు జన్మనిచ్చిన తర్వాత సంఖ్య గణనీయంగా పెరిగింది. మన రాష్ట్రానికి సరిహద్దుగా ఉన్న మహారాష్ట్ర తడోబా, అంధేరి టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ నుంచి ప్రాణహిత, వార్ధా నదుల గుండా కాగజ్‌నగర్ కారిడార్‌లోకి ప్రవేశిస్తున్న పులులు ఇక్కడే ఆవాసం ఏర్పాటు చేసుకుంటున్నాయి. కాగజ్‌నగర్ ఫారెస్ట్‌ను నేషనల్ టైగర్ కన్జర్వేటివ్ అథారిటీ కూడా గుర్తించింది. ఇప్పుడు కాగజ్‌నగర్ అడవుల్లో పులులు విచ్చలవిడిగా తిరుగుతున్నాయి.

### పులుల సంరక్షణకు నిధుల కొరత

సుమారు ఐదేళ్లక్రితమే ఆసిఫాబాద్ జిల్లా అడవులను టైగర్ కారిడార్‌గా గుర్తించినప్పటికీ నిధులు వెచ్చించిన దాఖలాలు లేవు. గతంలో ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్‌గా ఉన్న పీకే ఝా ఈ ప్రాంతంలో పర్యటించి రూ. 5 కోట్ల నిధులు కేటాయిస్తామని ప్రకటించారు. కొద్ది కాలానికే ఆయన రిటైర్డ్ కావడంతో నిధుల సంగతి పక్కకు పోయింది. తర్వాత బర్డ్‌వాక్ పేరుతో రెండు మూడుసార్లు ఫెస్టివల్ సందర్భంగా ఈ ప్రాంతానికి వచ్చిన అప్పటి పీసీసీఎఫ్ శోభతో పాటు అధికారులు పులులున్న ప్రాంతంగా పొగిడారే తప్ప ఎలాంటి నిధులు కేటాయించలేదు. దీంతో కంపా (కాంపన్సేటరీ అఫోరెస్టేషన్ ఫండ్ మేనేజ్‌మెంట్ అండ్ ప్లానింగ్ అథారిటీ) నిధుల మీదే ఆధారపడాల్సిన దుస్థితి దాపురించింది. చిరు ఉద్యోగుల జీతాలు, ప్లాంటేషన్, ఇతర ఖర్చులకు మాత్రమే నిధులు కేటాయిస్తున్నట్లు తెలుస్తున్నది. పులుల కోసం శాఖాహార జంతువులను పెంచడం, పులులు తిరిగే ప్రాంతాల్లో అడవులను, వెదురు కట్ చేయకుండా చూడడం తదితర పనులకు సరైన నిధులు లేకపోవడంవంటి కారణాలతో పులుల సంరక్షణకు కావాల్సిన చర్యలు చేపట్టేందుకు అధికారులకు కష్టంగా మారింది.

### కవ్వాల్ టైగర్ జోన్‌కు రూ. 40 కోట్లు

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని జన్నారం కేంద్రంగా 2012లో కవ్వాల్ టైగర్ జోన్ ఏర్పాటు చేశారు. 892.23 చదరపు కిలోమీటర్ల కోర్ ఏరియా, 1119.68 చదరపు కిలోమీటరుల బఫర్ ఏరియా గుర్తించారు. ఈ ఫారెస్ట్‌ను పులులు ఆవాసయోగ్యంగా డెవలప్ చేసేందుకు కేంద్రం ప్రభుత్వం యేటా రూ. 4 కోట్ల బడ్జెట్ కేటాయిస్తోంది. ఇందులో పులుల కోసమే దాదాపు రూ. కోటిన్నర నుంచి రూ. రెండు కోట్లు వెచ్చిస్తున్నారు. ఇప్పటి వరకు రూ. 40 కోట్ల వరకు కవ్వాల్‌కు నిధులు వచ్చినట్లు సమాచారం. శాఖాహార జంతువుల సంతతి పెంపుకోసం గడ్డి క్షేత్రాలు, నీటి వసతి కోసం సాసర్‌పిట్‌లు, కుంటలు, చెక్‌డ్యాంలు నిర్మించారు. కవ్వాల్‌కు తడోబా, తిప్పేశ్వర్, ఇంద్రావతి, కన్నెర్‌గాం, రిజర్వు ప్రాంతాల నుంచి కవ్వాల్‌కు పులులు వస్తాయని భావించారు. కవ్వాల్ పరిధిలో గ్రామాలను ఖాళీ చేయించారు. కానీ ఇప్పటి వరకు ఒక్క పులికూడా వచ్చి ఆవాసం ఏర్పరచుకోలేదు. కవ్వాల్ రిజర్వు ఫారెస్ట్‌కు, ఆసిఫాబాద్ అడవులకు మధ్యలో సింగరేణి బొగ్గుగనులు ఉండడం, హైవే రోడ్డు కారణంగా నిత్యం వేలాది వాహనాల రాకపోకలు, ఓపెన్‌కాస్ట్‌ల తవ్వకాలతో పులులు కవ్వాల్ వెళ్లలేక పోతున్నట్లు తెలుస్తున్నది.

### అవగాహన కల్పించడంలో విఫలం

ఆసిఫాబాద్ జిల్లాలో ఆదివాసీ, గిరిజన ప్రజలు నివాసం ఎక్కువగా ఉంటున్నారు. వీళ్లంతా అడవిని, అటవీ భూములని నమ్ముకొని బతుకుతున్నారు. ఈ క్రమంలో పులుల సంఖ్య పెరిగి జనాల ప్రాణాలు పోతుండగా అవగాహన కల్పించడంలో అటవీ అధికారులు విఫలమవుతున్నారు. యేటేటా పులుల సంచారం పెరుగుతుండడంతో తరుచుగా దాడులు జరుగుతున్నాయి. పశువులతోపాటు, మనుషులపైనా పులులు దాడులకు పాల్పడుతూ ప్రాణాలు తీస్తున్నాయి. మహారాష్ట్రలో పులుల దాడుల్లో చనిపోయిన పశువులకు మార్కెట్ విలువను బట్టిపరిహారం అక్కడ అందిస్తుంటే.. ఇక్కడ మాత్రం రూ. 5 వేల నుంచి రూ. 10 వేల వరకు మాత్రమే ఇస్తున్నారు. మహారాష్ట్రలో పులిదాడిలో మనిషి చనిపోతే రూ. 25 లక్షలు పరిహారంగా ఇస్తుండగా, ఇక్కడ మాత్రం రూ. 10 లక్షలు మాత్రమే పంపిణీ చేస్తున్నారు. పులులు ఎక్కువగా సంచరించే కాగజ్‌నగర్ అడవుల్లో పులుల సంరక్షణకు, ప్రజలకు అవగాహన కల్పించేందుకు సరైన నిధుల లేకపోవడంతోనే అధికారులు సరైన చర్యలు చేపట్టలేకపోతున్నారు. ఒక్క పులికూడా లేని కవ్వాల్‌కు కోట్లాది రూపాయలను కేటాయిస్తున్న అధికారులు... పులుల సంఖ్య ఎక్కువగా ఉన్న కాగజ్‌నగర్ అడవుల్లో పులుల సంరక్షణకు మాత్రం నిధులను ఇవ్వడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి.

### పులుల సంరక్షణ కోసం నిధులు రాలేదు..

కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాకు పులుల సంరక్షణ కోసం ఎలాంటి నిధులు రాలేదు. టైగర్ జోన్ ఉన్న ప్రాంతంలో కోర్ ఏరియా, బఫర్ ఏరియాలకు ప్రత్యేకంగా నిధులు వస్తాయి. ఆసిఫాబాద్ జిల్లాలో పులుల సంచారం ఉంది. కొన్ని పులులు స్థిర నివాసం ఏర్పర్చుకున్నాయి. ఆసిఫాబాద్ జిల్లాకు గతంలో ఎన్ని నిధులు వచ్చాయో నాకు తెలియదు కానీ.. ఏడాది మాత్రం ఎలాంటి నిధులు రాలేదు. - నీరజ్ కుమార్ టిబ్రివాల్, జిల్లా అటవీ శాఖ అధికారి





దండేపల్లి : తాళ్లపేట రేంజ్ కార్యాలయంలో సీజ్ చేసిన సామగ్రిని వాహనంలోకి ఎక్కిస్తున్న కోర్టు సిబ్బంది

# తాళ్ల పేట రేంజ్, జన్నారం డివిజన్ కార్యాలయాల ఆస్తులు సీజ్

**కోర్టు ధిక్కరణలో భాగంగా ఆయాచోట్ల సామగ్రి తరలింపు**

దండేపల్లి/జన్నారం, డిసెంబర్ 13 : మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలంలోని తాళ్లపేట రేంజ్ కార్యాలయం, జన్నారం అటవీశాఖ డివిజన్ కార్యాలయంలోని ఆస్తులను గోదావరిఖని లేబర్ కోర్టు ఆదేశాల మేరకు శుక్రవారం సీజ్ చేశారు. లక్షెట్టిపేట ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు అధికారులు ఎండీ యూసుఫ్ అలీ, సాయికుమార్, సంధ్యారాణి ఆధ్వర్యంలో ఆయా చోట్ల కంప్యూటర్లు, కుర్చీలు, టేబుళ్లు, బీరువాలు, జీప్ తదితర వస్తువులను సీజ్ చేసి లక్షెట్టిపేట కోర్టుకు తరలించారు.

### వేతనం చెల్లించకపోవడంతోనే..

కడెం మండలం దోస్తునగర్‌కు చెందిన బియ్యాల లింగన్న (రాజలింగు) 30 ఏళ్లుగా జన్నారం, తాళ్లపేట రేంజ్ కార్యాలయాల్లో దినసరి కార్మికుడిగా పనిచేశాడు. 2016 లో లింగన్నను ఉద్యోగం నుంచి తొలగించారు. అతను న్యాయం కోసం పెద్దపెల్లి జిల్లాలోని గోదావరిఖని లేబర్ కోర్టులో కేసు వేశాడు. దీంతో కోర్టు న్యాయమూర్తి లింగన్నను ఉద్యోగంలోకి తీసుకోవాలని 2024 జూన్ 18న ఆదేశాలు జారీ చేశారు. సదరు వ్యక్తిని ఉద్యోగంలోకి తీసుకోకుండా, నాలుగు నెలల 15 రోజుల జీతం (రూ. లక్ష) కూడా ఇవ్వకపోవడంతో అదే కోర్టును మళ్లీ ఆశ్రయించాడు. దీంతో కోర్టు ధిక్కరణలో భాగంగా కార్యాలయాల్లోని ఆస్తులను జప్తు చేయాల్సిందిగా ఆదేశించారు. ఈ విషయమై డీఎఫ్‌వో శివ్ ఆశీష్‌సింగ్‌ను వివరణ కోరగా.. కోర్టు ఆదేశాల మేరకు ఆస్తులు జప్తు చేశారని, హైకోర్టులో అప్పీలుకు వెళ్తామని అటవీ అధికారులు తెలిపారు.



జన్నారం డీఎఫ్‌వో కార్యాలయంలో ఆస్తిని జప్తు చేసి వ్యాన్‌లో తీసుకెళ్తున్న కోర్టు అధికారులు

# గ్రూప్-2ను పకడ్బందీగా నిర్వహించాలి

**మంచిర్యాల కలెక్టర్ కుమార్‌దీపక్**

నస్పూర్, డిసెంబరు 13 : జిల్లాలో ఈ నెల 15,16 తేదీల్లో గ్రూప్–2 పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించేలా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. శుక్రవారం నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో డీసీపీ భాస్కర్,అదనపు కలెక్టర్ మోతీలాల్, అదనపు డీసీపీ రాజుతో కలిసి సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పరీక్షల నిర్వహణ కోసం 48 కేంద్రాలను ఏర్పాటు చేశామని, 14,951 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరవుతారని తెలిపారు. నోడల్ అధికారిగా అదనపు కలెక్టర్ మోతీలాల్, పోలీసు నోడల్ అధికారిగా బెల్లంపల్లి ఏఆర్ ఏసీపీ సుందర్, రీజియన్ కో ఆర్డినేటర్‌గా బెల్లంపల్లి పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ దేవేందర్‌రెడ్డిని నియమించినట్లు చెప్పారు. ప్రతి పరీక్షా కేంద్రంలో వైద్య, పోలీసు సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. ఉదయం 8.30, మధ్యాహ్నం 1.30 గంటల నుంచి కేంద్రాల్లోకి అనుమతిస్తారని, ఉదయం 9.30కి, మధ్యాహ్నం 2.30 గంటలకు గేట్లు మూసివేయడం జరుగుతుందన్నారు. 15న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పేపర్ 1, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పేపర్ 2, 16న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పేపర్ 3, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పేపర్ 4 పరీక్షలు ఉంటాయని తెలిపారు. అభ్యర్థులు హాల్ టికెట్, ఒరిజినల్ గుర్తింపు కార్డు తీసుకురావాలన్నారు. డీసీపీ భాస్కర్ మాట్లాడుతూ పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు.

### అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి : కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, డిసెంబర్ 13 : జిల్లాలోని 18 కేంద్రాల్లో నిర్వహించే గ్రూప్–2 పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో ఏర్పాటుచేసిన పరీక్షా కేంద్రాన్ని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు, జిల్లా అదనపు కలెక్టర్, పరీక్షల నోడల్ అధికారి దీపక్ తివారీతో కలిసి సందర్శించారు. కలెక్టర్ మాట్లాడుతూ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని, కేటాయించిన విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలని సూచించారు. అనంతరం జిల్లా కేంద్రంలోని పీటీజీ గురుకుల బాలుర పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.

### పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు

గ్రూప్–2 పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎస్పీ డీవీ శ్రీనివాస్ రావు తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ప్రభాకర్ రావు, డీఎస్పీలు కరుణాకర్, రామానుజం, సీఐలు, ఎస్ఐలు ఉన్నారు.



నస్పూర్ : మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్‌దీపక్



ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్ : అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, ఎస్పీ శ్రీనివాసరావు

## ఇగమే ఇగం..

మంచిర్యాల జిల్లాలో ఒక్కసారిగా ఉష్ణోగ్రతలు పడిపోగా, చలి తీవ్రత పెరిగింది. ఉదయం ఎనిమిదింటిదాకా పొగమంచు పడుతుండగా, ప్రజానీకం గజగజ వణికిపోతున్నది. వాహనాల డ్రైవర్లు తప్పనిసరి పరిస్థితుల్లో ఫ్లడ్ లైట్లు వేసుకొని ప్రయాణించాల్సి వస్తున్నది. ఇక రాత్రి 6 గంటలు దాటిందంటే చాలు రోడ్లపై సందడి తగ్గిపోతున్నది. ప్రధానంగా మారుమూల ప్రాంతాల్లో గడ్డకట్టుకుపోయేలా ఇగం పెడుతుండగా, చిన్నాపెద్దలంతా నెగడులు వేసుకొని చలి మంటలు కాగుతున్నారు.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, మంచిర్యాల



శ్రీరాంపూర్ ఏరియాలో కమ్ముకున్న పొగమంచు

మంచిర్యాల జిల్లా కేంద్రంలో చలిమంట కాగుతున్న స్థానికులు

